క్లుప్తంగా

అందుబాటులో ఉచిత న్యాయసేవలు

సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య



పెడన: బడుగు బలహీనవర్గాల వారికి ఉచితంగా న్యాయసేవలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పుల్లపాడు గ్రామ సచివాలయం వద్ద న్యాయవిజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జడ్జి రామకృష్ణయ్య మాట్లాడుతూ నిరుపేదలు న్యాయపోరాటం చేయాల్సి వస్తే అందుకు ఉచిత న్యాయం అందించడానికి జిల్లా న్యాయసేవాధికారి సంస్థ ఉందని స్పష్టం చేశారు. న్యాయవాదులు సీహెచ్ ముసలయ్య, ఎస్.సుధాకర్, వృద్ధాశ్రమం నిర్వాహకురాలు కె.సుశీల, ఆర్ఐ మణికుమార్, స్థానిక నాయకులు జోగి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కార్నియాల దానం



మృతురాలు సుధారాణి (ఫైల్)

నాగాయలంక: గ్రామంలోని 4వ వార్డులో అనారోగ్యంతో మంగళవారం మృతి చెందిన శిష్టా సుధారాణి (56) నేత్రాలను విజయవాడ తాడిగడపలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. ఆమె భర్త వెంకట సుబ్రహ్మణ్యం రిటైర్డ్ టీచర్. కుమారుడు సాయి షణ్ముఖ చంద్రశేఖరన్, కుమార్తె సుశీల శృతి ఇతర కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా నేత్ర దానానికి ముందుకొచ్చారు. నేత్రదాన మోటివేటర్స్‌గా ఉన్న స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కె.వెంకట నారాయణకు సమాచారం అందించగా వారి సహకారంతో కంటి ఆసుపత్రి లాబ్ టెక్నీషియన్ మహేష్ బృందం మృతురాలి నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి తీసుకువెళ్లారు. తమ సంస్థ ద్వారా ఇప్పటికి సేకరించిన నేత్రాల సంఖ్య 207కు చేరాయని రఘుశేఖర్ చెప్పారు.

సహజ యోగా, ధ్యానంపై అవగాహన



అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సహజయోగ ధ్యానంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మచిలీపట్నం కు చెందిన సహజ యోగా ట్రస్ట్ నిర్వాహకులు పీవీ రామమోహనరావు విద్యార్థులకు యోగాలో శిక్షణ ఇచ్చారు. ఎన్ఎస్ఎస్ పీవో ఏ శ్రీనివాసరావు, ట్రస్ట్ ప్రతినిధులు దుర్గ, రాణి, ప్రసన్న, అధ్యాపకులు హరికృష్ణ, లోవరాజు, రవిశంకర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న గాలింపు చర్యలు



కోడూరు: పాలకాయతిప్ప బీచ్ వద్ద గల్లంతైన గుడివాడకు చెందిన యువకుడు ముషారఫ్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మూడో రోజైన మంగళవారం కూడా పోలీసులు, రెవెన్యూ, మెరైన్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సముద్రంలో గాలింపు నిర్వహించారు. పది ప్రత్యేక బృందాలు పడవల్లో తీరం వెంట జల్లెడ పడుతున్నాయి. మడఅడవుల్లోని పాయల్లో కూడా ముషారఫ్ ఆచూకీ కోసం గాలిస్తున్నారు. సముద్రంలో ఏర్పడిన ఇసుక గుంతల్లో కూరుకుపోవడం వల్ల పైకి తేలి ఉండదని, లేక సముద్రంలో జీవాలు తీనేసి ఉండడం వల్ల కూడా పైకి తేలలేదనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కూడా ఈ గాలింపు కొనసాగుతుందని తహసీల్దార్ శ్రీనునాయక్, ఎస్ఐ శిరీష తెలిపారు.

23న ఉపాధి పనుల ఎంపికకు గ్రామ సభలు

నాగాయలంక: మండలంలో ఉపాధి హామీ పనుల ఎంపిక కోసం 23న పంచాయతీల వారీగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు నాగాయలంక ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.రామ్‌కుమార్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ టీవీఎస్ ముత్యాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 22 పంచాయతీల్లో చేపట్టే పనులను ప్రాధాన్యతా క్రమంలో సభల్లో ఎంపిక చేస్తారన్నారు. గ్రామ సభల నిర్వహణకు 22 మంది మండల స్థాయి అధికారులను నియమించినట్లు వివరించారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ముందస్తుగానే టాంటాం వేయించి గ్రామ సభలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

సక్రమంగా పనిచేయకుంటే సరెండరే

- కౌన్సిల్ ఆమోదం లేకుండా టెండర్లు ఎలా పిలుస్తారు?
- వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల ప్రశ్నలతో అధికారులకు చెమటలు
- పలు అంశాలపై పొంతనలేని సమాధానాలు
- వాడీవేడిగా నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం



కౌన్సిల్‌లో అధికారుల తీరును ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ సుబ్బన్న



సమావేశంలో ఆవేదన వ్యక్తం చేస్తున్న 48వ డివిజన్ కార్పొరేటర్ ముచ్చర్ల శైలజ

మచిలీపట్నంటౌన్: అధికార పార్టీకి కొమ్ముకాస్తూ, నిబంధనలకు తిలోదకాలు ఇస్తూ మునిసిపల్ కౌన్సిల్ పట్ల నిర్లక్ష్యంగా ఇకపై వ్యవహరిస్తే ఆ అధికారులపై చర్యలు తప్పవంటూ మంగళవారం మేయర్ చిటికిన వెంకటేశ్వమ్మ అధ్యక్షతన జరిగిన నగర పాలక సంస్థ సాధారణ సమావేశంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం కార్పొరేషన్లలో కమిషనర్ నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు అధికార టీడీపీ నాయకులు చెప్పినట్లే ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ సీపీ కార్పొరేషన్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న మాట మర్చిపోయి వారు చెప్పిందల్లా తానా, తందానా అంటూ చేస్తున్నారని ఇలా అయితే అందరూ ఇబ్బంది పడతారని కార్పొరేటర్లు ధ్వజమెత్తారు. నగరపాలక సంస్థలో అధికారులు, సిబ్బంది, కార్పొరేటర్లకు కమిషనరే తండ్రి లాంటి వారని అందర్నీ సమానంగా చూడకుండా వ్యత్యాసం చూపితే ఎలాగని ప్రశ్నించారు. పాలనా వ్యవహారాల్లో కమిషనర్ సక్రమంగా వ్యవహరించకుంటే ప్రభుత్వానికి సరెండర్ చేసేందుకైనా వెనుకాడమని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ మేకల సుబ్బన్న పలు అంశాలపై అధికారులను నిలదీశారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ ప్రాతినిధ్యం వహించే 43వ సచివాలయంలో అడ్మిన్, సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ విధులకు సెలవులు లేకుండానే డుమ్మా కొడుతున్నారని రుజువులతో సహా కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా అడ్మిన్‌పై ఇంత వరకు చర్యలు తీసుకోకపోవటం ఏంటని ప్రశ్నించారు. మేయర్ వెంకటేశ్వరమ్మే 15 రోజులక్రితంకమిషనర్‌కురాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై విచారణ జరుగుతోందని ఈ రోజే రిపోర్టు తీసుకుని అడ్మిన్‌పై చర్యలు తీసుకుంటామని కమిషనర్ బాపిరాజు తెలిపారు.

టెండర్ ఎలా పిలిచారు..

అమృత్ 2.0కు సంబంధించిన టెండరును కౌన్సిల్‌కు, మేయర్‌కు తెలియకుండానే ఎలా పిలిచారని ప్రశ్నించారు. అత్యవసరమని పిలిచామని కమిషనర్ చెప్పటంతో కౌన్సిల్, మేయర్ దృష్టిలో పెట్టకుండానే మీ ఇష్టానుసారం టెండరు పిలవచ్చునని ఎక్కడ ఉందో చెప్పాలని అడగటంతో తాను చేసింది తప్పేనని కమిషనర్ ఒప్పుకున్నారు. కౌన్సిల్‌కు తెలియకుండానే ఓ వ్యక్తి లైసెన్స్‌డ్ సర్వేయర్ కోసం దరఖాస్తు చేసుకున్న 20 రోజులకే ఎండార్స్‌మెంట్ ఎలా ఇస్తారని సుబ్బన్న ప్రశ్నించారు. దీనికి టౌన్ ప్లానింగ్ ఏసీపీ మల్లిఖార్జునరావు సమాధానమిస్తూ తాను చేసింది నిబంధనలకు విరుద్ధమేనని ఒప్పుకున్నారు. 27వ డివిజన్‌లో ఆ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ రాళ్ల కొట్టు రాము ఇటీవల ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేయగా కమిషనర్ బాపిరాజు సైతం రోడ్లన్నీ పూడ్చారని, ఇంత వరకు తప్పులేదన్నారు. అయితే గత వైఎస్సార్ సీపీ పాలనలో తమలా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేయలేదని అందువల్లే డివిజన్లలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయిందని డివిజన్‌కు రూ.50 వేలు ఖర్చు చేసి ఈ పనులు చేస్తున్నామని రాము మీడియాతో మాట్లాడారన్నారు. ప్రైవేటు కార్మికులకు రోజుకు రూ.800 చొప్పున కూలీ, జేసీబీ, రెండు ట్రాక్టర్లకు ఏ నిధుల నుంచి డబ్బులు చెల్లిస్తారని సుబ్బన్న ప్రశ్నించారు. కౌన్సిల్ ఆమోదం, వర్క్ ఆర్డర్, పని రికార్డు వంటివి లేకుండా మీ ఇష్టమొచ్చినట్లు చేస్తే కౌన్సిల్ దీనికి ఆమోదం తెలపదని హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఈ వెంకటేశ్వరరావు పొంతన లేని సమాధానాలు చెప్పటంతో సుబ్బన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందని ప్రధాన కోనేరుసెంటర్ కూడలే చీకటిమయంగా ఉంటోందని ఇలా ఎందుకు జరుగుతోందని 33వ డివిజన్ కార్పొరేటర్ మీర్ అస్గర్ అలీ ప్రశ్నించారు. మెటీరియల్ కాంట్రాక్ట్‌కు సంబంధించి టెండరు పూర్తయ్యిందని వర్క్ ఆర్డరు ఇవ్వాల్సి ఉందని వర్కర్ల టెండరు పూర్తయ్యిందని ఎంఈ శ్రీకాంత్ సభ దృష్టికి తీసుకువచ్చారు. టెండర్ల విషయం కౌన్సిల్ ముందు ఉంచకుండానే ఎలా పిలిచారని అస్గర్, సుబ్బన్న ప్రశ్నించారు. రూ.10 లక్షల్లోపు టెండరు కమిషనర్ ఇవ్వవచ్చనే కారణంతో పిలిచామని ఎంఈ బదులిచ్చారు. టీడీపీ ఇన్‌చార్జ్‌లమంటూ తమ డివిజన్‌లో కొంత మంది మా ఇంటిపై దాడులకు దిగుతున్నారని 48వ డివిజన్ కార్పొరేటర్ ముచ్చర్ల శైలజ ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రాంతంలో ఉన్న సచివాలయాన్ని తనకు తెలియకుండానే అర్ధాంతరంగా మార్చేశారని ఇది ఎంత వరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. 1వ డివిజన్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య పనుల సమాచారం ఇవ్వలేదని కార్పొరేటర్ జోగి చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 3వ డివిజన్‌లో ప్రధాన పైప్‌లైన్ నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేశారని ఏ నిధులతో చేశారో తెలపాలని డెప్యూటీ మేయర్ శీలం భారతి అధికారులను కోరారు. ఇకపై వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లకు డివిజన్ పరిధిలో జరిగే ప్రతి కార్యక్రమం చెప్పాలని, కౌన్సిల్ దృష్టిలో పెట్టకుండా ఎలాంటి పనులు చేయవద్దని, నిబంధనలకు విరుద్ధంగా ఇటీవల నిర్వాకాలకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సుబ్బన్న కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. లేకుంటే కమిషనర్‌నే ప్రభుత్వానికి సరెండర్ చేయాలని మేయర్ వెంకటేశ్వరమ్మను కోరారు. మునుపెన్నడూ లేని విధంగా కౌన్సిల్ సమావేశం పోలీస్ పహారా నడుమ జరగటం గమనార్హం.

సెంట్రింగ్ కార్మికుడికి గాయాలు

పెడన: సెంట్రింగ్ కార్మికుడు గాయపడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. మండలంలోని ముచ్చర్ల గ్రామానికి చెందిన వీఆర్ఏ వీరస్వామి కుమారుడు రవీంద్రబాబు (26) సెంట్రింగ్ పని చేస్తుంటాడు. మంగళవారం విజయవాడలోని ఒక ప్రాంతంలో పనిలో నిమగ్నమై ఉండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. సహచరులు రవీంద్రను హుటాహుటిన మచిలీపట్నంలోని చింతగుంట పాలెం తీసుకువచ్చారు. తహసీల్దారు అబ్దుల్ రహమాన్ మస్తానా స్పందించి ఆర్ఐ మణికుమార్‌కు ఆదేశాలు ఇవ్వడంతో రవీంద్రను మచిలీపట్నంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చూపించారు. రెండు చేతులు విరిగినట్లు వైద్యులు పేర్కొవడంతో ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని ఆర్ఐ మణికుమార్ తెలిపారు.

ప్రారంభమైన ఆరాధనోత్సవాలు

మచిలీపట్నంటౌన్: స్థానిక రాబర్ట్‌సన్‌పేటలోని శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అంతరాలయంగా ఉన్న శ్రీ రాఘవేంద్రస్వామి ఆలయంలో స్వామివారి ఆరాధనోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి పూర్వారాధన పూజ, ఫల అభిషేకం నిర్వహించారు. స్వామివారిని పూలతో అలంకరించటంతో భక్తులు హాజరై పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈవో డి.సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం తగదు

ఘంటసాల: రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ అన్నారు. మండలంలోని డీలర్లు, ఎండీయూ వాహనం ఆపరేటర్లతో మహిళామండలి సమావేశపు హాలులో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ ప్రసాద్ మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లు ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 10వ తారీకు లోపు రేషన్ పంపిణీ చేయాలన్నారు. డీలర్లు సకాలంలో డీడీలు చెల్లించి సరుకులు తీసుకోవాలన్నారు. ఎండీయూ ఆపరేటర్లు, డీలర్ల పనితీరును వీఆర్వోలు పర్యవేక్షించాలని తెలిపారు.

బంగారు నగలు చోరీ

కోనేరుసెంటర్: మచిలీపట్నంకు చెందిన నాయకుడి ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు అపహరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మచిలీపట్నం ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. మచిలీపట్నం భాస్కరపురానికి చెందిన వాలిశెట్టి మల్లి కుటుంబం ఈ నెల 13న వెస్ట్‌బెంగాల్‌లోని కరగ్రపూర్‌లోని బంధువుల ఇంట్లో వివాహ వేడుకలకు వెళ్లారు. మంగళవారం అపార్ట్‌మెంట్‌కు చెందిన వాచ్‌మెన్ మల్లి ఇంటి తలుపులు తెరచి ఉండటాన్ని గమనించి వెస్ట్‌బెంగాల్‌లో ఉన్న మల్లికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. దీంతో మల్లి బందరులోని తన బంధువులకు ఫోన్ చేసి ఇంటికి వెళ్లిచూడాల్సిందిగా కోరాడు. బంధువులు అపార్ట్‌మెంట్‌కు వెళ్లి చూడగా మల్లి ఇంటి తలుపులు తెరచి ఉన్నాయి. బీరువాలో ఉండాల్సిన నాలుగు గాజులు, ఒక ఉంగరంతో పాటు రూపులు, తదితర బంగారు ఆభరణాలు కనిపించలేదు. బంధువులు విషయాన్ని మల్లికి ఫోన్‌లో వివరించటంతో పాటు అతని బావ కూనసాని సత్యనారాయణ మచిలీపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సుమారు రూ.3 లక్షల వరకు నగలు అపహరించినట్లు అంచానా వేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్రమత్తతే ప్రాణాలకు రక్షణ

నాగాయలంకలో ఉద్యోగులకు ఎన్డీఆర్ఎఫ్ డెమో



రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలైతే చేపట్టాల్సిన ప్రథమ చికిత్సపై డెమో



మహిళా ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్న ఎన్డీఆర్ఎఫ్ టీమ్

నాగాయలంక: క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ఉద్యోగులు అనుకోని ప్రమాదాలు, విపత్తులు సంభవించిన సమయంలో అప్రమత్తంగా ఉంటే, వాటిని అధిగమించి ప్రజలకు రక్షణ ఇవ్వగలుగుతామని ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ పింటు కుమార్ నంది పేర్కొన్నారు. రెవెన్యూ, ఎంపీడీఓ ఆధ్వర్యంలో ఫామెక్స్ కమ్ కమ్యూనిటీ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ కింద నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్డీఆర్ఎఫ్) రెస్క్యూ బృందం మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులకు వివిధ ప్రమాద అంశాలపై అవగాహన సదస్సు (డెమో) ప్రయోజనాత్మకంగా సాగింది. మండలంలోని దీవులు, తీర గ్రామాల ప్రజలకు ఉపయుక్తంగా ఉండే విధంగా ఆయా గ్రామాల కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయాల సిబ్బంది, వీఆర్ఏలకు ఎన్డీఆర్ఎఫ్ టీమ్ అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు చేపట్టాల్సిన ప్రాథమిక చికిత్స, ఆకస్మిక గుండెపోటుతో కుప్పకూలితే రక్షణకు అవకాశం ఉన్న సీపీఆర్ ఎలా నిర్వహించాలనే అంశాలను ప్రదర్శించి వివరించారు. క్లినికల్ డెత్–బయోలాజికల్ డెత్ ఈ రెండింటి మధ్య ఉండే ఆరు నిమిషాల సమయంలో సీపీఆర్ చేయడం వలన సత్ఫలితం పొందే అవకాశాలను వివరించారు. లిఫ్టింగ్ మూమ్‌మెంట్, పిడుగులు, భూకంపాలు, వరదలు లాంటి విపత్తుల వేళ వాటి నుంచి ఎలా బయట పడాలి, పాముకాటు సంబవిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై మాక్‌డ్రిల్ చేసి చూపించారు. తహసీల్దార్ ఎం.హరనాథ్ మాట్లాడుతూ విపత్తు నిర్వహణ సంస్థ బృందం ప్రదర్శించిన డెమోలతో ఉద్యోగులకు సంపూర్ణ అవగాహన చేకూరిందన్నారు. కార్యక్రమంలో అవనిగడ్డ ఫైర్ ఆఫీసర్ పి.ఎస్.వి.వి.ప్రసాద్, ఎంపీడీఓ జె.రామ్ కుమార్, ఈఓపీఆర్డి కె.అప్పలనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

పెడన: దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 80వ జయంతి మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ నాయకుడు లింగాల సుధాకరరావు, పట్టణ అధ్యక్షుడు సీహెచ్‌వీ అప్పారావు, ఆకురాతి జనార్దనరావు, యక్కల నాగేశ్వరరావు, కొల్లూరి నాగభూషణం, రాగిరమేష్, బొర్రా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 80వ జయంతిని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు అబ్దుల్‌మతీన్ మాట్లాడుతూ భారతదేశంలో శాస్త్ర, సాంకేతిక, వైజ్ఞానిక రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చేందుకు రాజీవ్‌గాంధీ కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి కొడమంచిలి చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి సయ్యద్ నూరుద్దీన్, సేవాదళ్ నాయకులు చిలుకోటి ప్రసాద్, నాయకురాలు రహ్మతున్నీసా పాల్గొన్నారు.

వాహనాల విడిభాగాల వేలం



కోనేరుసెంటర్: పోలీసుశాఖకు సంబంధించిన వాహనాల మరమ్మతులు అనంతరం నిర్వహించిన విడిభాగాల వేలంలో రూ.31,600 ఆదాయం లభించింది. ఇటీవల పలు వాహనాలకు మరమ్మతులు చేపట్టిన అధికారులు వాటిలో పనికిరాని విడిభాగాలకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. మచిలీపట్నంకు చెందిన బిడ్డర్‌లు పలువురు పోటీపడగా సర్దార్ అనే బిడ్డర్ అత్యధికంగా రూ.31,600లకు విడి భాగాలను దక్కించుకున్నాడు. ఇన్‌చార్జ్ ఏఎస్పీ ప్రసాద్, బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్, స్పెషల్ బ్రాంచ్ సీఐ రంగనాథ్, ఆర్ఐ వెల్ఫేర్ బి.రాఘవయ్య, ఆర్ఐ (ఎంటీఓ) వై. రవికిరణ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.

బంద్ విజయవంతం చేయాలని పిలుపు



కోడూరులో బంద్‌కు సహకరించాలని కోరుతున్న ఎస్సీ సంఘ నేతలు



అవనిగడ్డ ఎస్ఐ శ్రీనివాస్‌కు వినతి పత్రం ఇస్తున్న మాలమహానాడు నేతలు



గూడూరులో బంద్‌కు సహకరించాలని వ్యాపారులను కోరుతున్న ఎస్సీ నాయకులు

అవనిగడ్డ: భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఎస్సీ వర్గీకరణ చేపట్టడాన్ని నిరసిస్తూ బుధవారం నిర్వహించే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ పిలుపునిచ్చారు. భారత్ బంద్ నేపథ్యంలో ఎస్ఐ శ్రీనివాస్, ఆర్టీసీ డీఎం హనుమంతరావుతో పాటు పలు శాఖల అధికారులు, విద్యా సంస్థల అధినేతలకు బంద్ విషయం తెలియజేశారు. మాలలు పెద్ద ఎత్తున ఈ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు బొంతు ప్రకాష్, మెరుగు రణధీర్, జి.రాకేష్, పుట్టి కృష్ణ, మద్దాల ధర్మారావు, వరుణ్, చైతన్య పాల్గొన్నారు.

కోడూరు: ఎస్సీ వర్గీకరణ తీర్పును నిరసిస్తూ బుధవారం చేపట్టిన భారత బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్సీ సంఘ నేతలు మంగళవారం విస్తృత ప్రచారం చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల వద్దకు వెళ్లి బంద్‌కు సహకరించాలని కోరారు. వాణిజ్య, వర్తక వ్యాపారాలు, ప్రైవేటు కార్యాలయలను కూడా మూసివేయాలని పిలుపునిచ్చారు. అణగారిన వర్గాల ఐక్యతను దెబ్బతీసే విధంగా ఎస్సీ వర్గీకరణ తీర్పును ఇచ్చారని, దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు మాలమహానాడు జిల్లా నేత దోవా గోవర్ధన్ తెలిపారు. అనంతరం ఆటో యూనియన్, ఆర్టీసీ యూనియన్, వివిధ యూనియన్ నేతలతో సమావేశమై బంద్ గురించి వివరించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, నేతలు బత్తుల రాజు, రాజకుమార్, పరసాబత్తిన అరవింద్, బొంతు నవభరత్ పాల్గొన్నారు.

కృత్తివెన్ను: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం దేశవ్యాప్తంగా తలపెట్టిన భారత్‌బంద్‌కు సహకరించాలని కృత్తివెన్ను మండలంలోని జైభీమ్ సభ్యులు అధికారులు, దుకాణాల యజమానులను కోరారు. మంగళవారం వారు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దుకాణాల యజమానులకు వినతి పత్రాలను ఇచ్చి బంద్‌కు సహకరించాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలు భారత్ బంద్‌కు పూర్తిగా సహకరించాలని కోరారు.

గూడూరు: ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ బుధవారం చేపట్టిన భారత్ బంద్‌కు మద్దతు కోరుతూ మంగళవారం గూడూరులోని వర్తక, వాణిజ్య, వ్యాపార సంస్థల యజమానులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల సిబ్బందిని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కామేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు కలిశారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ పిటీషన్ దాఖలు చేయనున్నట్లు వివరించారు. మండల వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ వేము ఆనంద్, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ బడుగు సామ్యేలు, మద్దాల పవన్, రాంబాబు, అంబేడ్కర్, సజీవ్ పాల్గొన్నారు.

మోపిదేవి: మండలంలో బుధవారం తలపెట్టిన భారత్ బంద్‌కు సహకరించాలని పలువురు దళిత సంఘం ప్రతినిధులు కోరారు. మంగళవారం స్థానిక ఎస్ఐ సత్యనారాయణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును నిరసిస్తూ జాతీయ పార్టీలు, జాతీయ ప్రజా సంఘాల నేతలు పిలుపు మేరకు మండలంలో కూడా బంద్ పాటిస్తున్నట్టు తెలిపారు. మండంలోని ప్రభుత్వ, ప్రవేటు, కార్యాలయాలు, విద్యా సంస్థలు, వాణిజ్య, వర్తక సంస్థలు, ఆటో వర్కర్స్ యూనియన్ ప్రతి ఒక్కరూ భారత్‌బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించాలని ఎంఈవో దుర్గా సాగర్‌కు కూడా జి.శ్రీను, కె.అశోక్, పి.రవితేజ, అంజనేయప్రసాద్, రవీంద్ర తదితరులు వినతిపత్రం అందజేశారు .

నీరు విడుదల చేయాలని ఎమ్మెల్యేకు వినతి



మామిడి కోళ్ల కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్

గూడూరు: కంకటావ, లేళ్లగరువు, షా అబ్దుల్లా పాలెం ఆయకట్టుకు సాగునీరు అందించే మామిడి కోళ్ల కాల్వకు నీరు విడుదల చేయాలని స్థానిక రైతులు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌ను అభ్యర్థించారు. మంగళవారం లేళ్లగరువులో పర్యటించిన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌ను కలిసిన రైతులు సకాలంలో పంటకు నీరు అందక పోతే పైరు ఎండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మామిడి కోళ్ల కాల్వను పరిశీలించిన ఎమ్మెల్యే సాగు నీటి పారుదల శాఖ అధికారుకు ఫోన్ చేసి మాట్లాడారు. రైతులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా కాల్వకు నీరు విడుదల చేసి ఆదుకోవాలని ఎస్ఈ, డీఈలను కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నీటి విడుదలకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పంచకర్ల సురేష్, పోతన లక్ష్మీనరసింహస్వామి, మద్దాల మోహనరావు, వాకా శ్రీనివాసరావు, శీరం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, పశువైద్యాధికారులు

అవనిగడ్డ: పలు రకాల వ్యాధులను అరికట్టేందుకు పశువులకు తప్పనిసరిగా బ్రూ సెల్లోసెస్ వ్యాధి నియంత్రణ టీకాలు వేయించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద మంగళవారం జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా చేపట్టిన బ్రూ సెల్లోసెస్ వ్యాధి నివారణ టీకాల ప్రచార కార్యక్రమాన్ని పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సెప్టెంబర్ 18వ తేదీ వరకూ నెలరోజులు పాటు చేపట్టనున్న పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశువైద్యశాల వద్ద టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బొండు సాంబశివరావు మాట్లాడుతూ 4 నుంచి 8 నెలల వయస్సున్న పెయ్య దూడలకు ఈ టీకాలను తప్పనిసరిగా వేయించాలన్నారు. జ్వరం, బలహీనత, మాయ వేయకపోవడం, గర్భస్రావాలు ఈ వ్యాధి లక్షణాలని చెప్పారు. చికిత్స లేని ఈ వ్యాధి నియంత్రణకు చేపట్టిన ఈ టీకా కార్యక్రమాన్ని ప్రతిఒక్క పశుపోషకులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ పరిధిలోని పశు వైద్యులు డాక్టర్ మౌనిక, డాక్టర్ షఫీ, డాక్టర్ సుధారాణి, డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

రేపు వైద్య, రక్తదాన శిబిరం

నాగాయలంక: అనూ గ్రూప్ ఆఫ్ హాస్పటల్స్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్థానిక సబ్‌బ్రాంచ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుక పురస్కరించుకుని గురువారం నాగాయంకలో మెగా వైద్యశిబిరం, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు అఖిల భారత చిరంజీవి యువత కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు భోగాది శివవిష్ణువర్ధన్ మంగళవారం తెలిపారు. గుండె సంబంధిత ఈసీజీ, ఎకో, బీపీ, సుగర్, స్త్రీల గర్భకోశ సమస్యలకు పరీక్షలు, మూత్రపిండాలు, జీర్ణకోశ తదితర వ్యాధులకు సంబంధిత పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. మందులను పారిశ్రామిక వేత్త బొండాడ రాఘవేంద్రరావు సౌజన్యంతో ఉచితంగా అందిస్తామన్నారు. అవసరమైనవారు ముందుగా 80996 87677, 98888 99966, 79939 82165 మొబైల్ నంబర్లను సంప్రదించి నమోదు చేసుకోవాలన్నారు.

20 రోజులుగా తాగునీటి కొరత

మేళ్లమర్తిలంక(మోపిదేవి): మండలంలోని మేళ్లమర్తిలంక లో 20 రోజులుగా తాగునీరు లేదని, వీధి లైట్లు వెలగడం లేదని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులకు అనేక సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తంచేశారు.సముద్రం ఆటుపోట్లకు బోరుపంపుల నుంచి ఉప్పునీరు వస్తోందన్నారు. కుళాయి నీరు వదలాలని స్థానికులు కొలసాని రామకృష్ణ, సిద్ధినేని శివయ్య, కొల్ల అశోక్, అప్పికట్ల నాగరాజు అధికారులను కోరారు.